యీ కూచినిచూచి సంతోషించండి !" అని యిరువురకు ప్రబోధం చేసేరు పట్నంలోని ప్రజఅంతా.

నాటినుండీ రెబక్కమ్మ, కువలయార్ద్రి. మతం అన్నది మఱచి కట్టవకొట్టిపారేసేసి, ఏకండీ యిల్లుగా రెండిళ్ళూ గావించు కుని ఆ దొఱకిన బిడ్డణ్ణి దైవదత్తంగా చేకొని యిరువురూ కలిసి పెంచి పెద్దవాణ్ణి చేశారు. అతగాడు క్రమక్రమంగా శుక్లపక్ష చంద్రుడిలా పెరిగి ప్రపంచ పౌరుడయ్యేడు.

కధ కంచెకు వెళ్ళింది. మనం మనయింటికి వెళ్ళేం.

.... .... .... .... ....

## ఆస్తికత జీవనోపాధి

"చొక్కా చిరిగితె దర్జీ కుట్టు
జోడూ చిరిగితె 'గొడారి' కుట్టు,
డిక్కీ చిరిగితె కుట్టే దెవడు ?"

అంటూ నడుస్తూ పాడుతూ, ఒకానొక బీబీ, గుబ్బెత, సిబ్బితి కత్తె చటాల్న ఆగింది రోడ్డువార చెప్పులు బాగుచేసే వాడిచెంత. ఆమె పేదతనంచే సరదా మానేసిందో సరదాచే మానేసిందో ఊహించడం కష్టం. కాని ఒకటి తేటతెల్లం. ఆమెను చూచేందుకు లోకం సరదాపడక మానదు. వాడు, ఆ గొడారి పాటను, అంత దూరాన్న బీబీ వుండంగానే, వినడం ప్రారంభించి, బీబీనిచూడ్డం మొదలుపెట్టినవాడై, ఆరి, లాసు, దిమ్మ, గూటం అన్నీ మరచి "దేవుడు" అని జవాబు చెప్పాడు. ఆ జవాబుకే ఆగినట్టుగా వుంది ఆ చేడియ ఆ గొడారివాని చెంత.

వాళ్ళిద్దరికీ అదివఱకే ఒక్కంత మక్కువా మైత్రీ అని అనుకోకపోరు ఆ దారే పోతూవున్నవాళ్లు, ఆవాళ్ళ యిద్దరూ అన్యోన్యం మార్చుకున్న చిరునవ్వుల దోసందునే!

"నూని గుడ్డలాళ్ళలా ఆ చొక్కా ఆ వేషం ఏంటి?" అని అడిగింది బీబీ. గొడారివాడు దిమ్మమీదకు ఎవరిదో బూట్సు మడమను ఎక్కించి సరిచేస్తూ—"ఇదే ఇప్పటి ఫాషన్. ఎరుగవు నివ్వు? "బెలూన్ సిల్కు" లేక "పారచూట్ పట్టు" అంటారు. నీ వెన్నడూ యుద్ధంలో "సెర్వు" చేసి రాలేదు లాగుంది" అన్నాడు. బీబీ "సెర్వు అంటే?"—"నీకు ఇంగ్లీషు రాదూ?"—"ఇన్నాళ్ళనుంచీ నీతో మాట్లాడివుంటే వచ్చి వుండేదేమో మూగదాన్ని నాకేం వస్తుంది?" అంది తన చేతిలోని కర్రను జీలీబెండు బొత్తల్లో మిగిలివున్న ఒకేఒక్క డిక్కీ ఇవతలకు వూడదీసి మోగిస్తు వాడు బ్రహ్మాండంగా నవ్వుతూ, దిమ్మమీద బూట్సును గూటంతో కొట్టడం ఆపి, "you see that lady" అన్నాడు.

"అంటే?" అంది బీబీ.

"ముందుచూడు! దాటిపోతుంది ఒక్కఅంగలో! ఆమె భుజాలను కనిపించేది ఏమిటది? పారచూట్ సిల్కు కబ్బా!" అన్నాడు.

అవతల మనిషి నురస్థలి నుబ్బెత్తుగావుంది కబ్బా. భుజకీర్తుల్లా బుజాలమీద దర్జీవాడి దర్జాకుట్టు బుడగలుదేరివుంది. బీబీ ఆ వంకచూస్తూ "ఆమె నీకు ఎల్లాతెలుసు?" అని అడిగింది.

"ఆమె యుద్ధంలో వాక్కాయగా పనిచేసింది!"—"అంటే?" "డబ్ల్యు. ఎ. సి. గా!"

"అంత [illegible] నా [illegible] వాలికిస్తున్నావు ఈ పొద్దు ?" అని అడిగింది బీబీ. అంతట్లో ఆ "లేడీ" అన్న ఆవిడ గొడారివాని సమీపంలోంచి రోడ్డమ్మటే నిగనిగమనే జోళ్ళతో నడుస్తూ కానవచ్చింది అందరికీని అతి సుందరంగా.

గొడారి అన్న "హాపీ న్యూయియర్ ! అమ్మగారూ !" అన్నాడు. ఆనేసరికి వానిగొంతు ఆమె చెవిని తియ్యగా గోకిందేమో, వానివైపు తిరిగి ఆగి, "నీవు తిరుగ మీ కులవృత్తిలో ప్రవేశించినావూ ?" అని అడిగింది.

వాడు నవ్వుతూ "మీరు ?" అని అడిగాడు.

"మా క్రైస్తవులకు కులంలేదు, కులవృత్తీలేదు. ఆలాగే వున్నాను" అంది లేడీ.

గొడారి చిన్నవాడు ఆమె బూటువంక చూస్తూ "బూట్సుకు షైనింగు ఎక్కడ పెట్టించారు అమ్మగారూ—" బాగున్నాయి !" అన్నాడు.

"ఇవి వోల్డు బూట్సు అని నీ వొక్కడవే గుర్తింపగలిగింది !" అని అంది ఆమె. "అయితే కబ్బా కొత్తది తొడిగారు అమ్మగారు" అంది బీబీ ఆమె బుజాలవంక, బుజాలమధ్య మెడచూస్తూ; లేడీమెళ్ళో బంగారు నెక్లాసువుంది ధగధగలాడుతూ. "అదంతా యుద్ధపు సంపాదనే తల్లీ !" అని అడిగింది బీబీ. "అయితే నేం ! మేంపడ్డ శ్రమఅంతా బూడిదలో పోసిన పన్నీరు అయిపూరుకుంది. తెల్లదొరలంతా వెళ్ళిపోయినారు. ఎవరికి నేడు న్యూయియర్ చెప్పేది తెలియకుండా వున్నాను" అంది ఆ లేడీ.

"ఎవళ్ళకేమిటి? పాతస్నేహితులకు" అన్నాడు గొడారన్న.

"మనవెంపు ఇప్పుడు చూచే పాతస్నేహితులు లేరు నిన్నొక్కణ్ణి తప్పిస్తే. నీవన్నా ఈ పొద్దు నా పుణ్యం కొద్దీ కాపడ్డావు. నిజంగా గుడ్‌మార్నింగ్; నీవల్లను హేపీ న్యూయియర్ ఉదయం అయింది ఈ 1-1-1948 ఉదయం. నీవే కనబడకపోతే ఏమైపోయేదాన్నో పాతకట్టెగా కొట్టుకు పోయేదాన్నేమో కాలవాహినిలో" అంది లేడీ. బీబీ తీరిగ్గా తనచేత నున్న ఒక్క డిక్కీ మోగించింది. "ఎంత దాని ఖరీదు?" అని అడిగింది లేడీ.

"అర్ధణా" అంది బీబీ. గొడారన్న బీబీ వంక చూస్తూ "ఆమెకు ఆ డిక్కీ న్యూయియర్ ప్రెజెంటుగా ఇవ్వు" అన్నాడు. బీబీ "అర్ధణా నివ్వు ఇస్తావా!" అని అడిగింది. "నేను ఆమెకు ఇచ్చేది ఏదో ఇదివఱకే ఇచ్చేను నోటితో న్యూయియర్ గ్రీటింగ్సు!" అన్నాడు. "నేనున్నూ డిక్కీ మోతతో ఆ మాత్రం సూచించగలను. డిక్కీనే ఇవ్వనక్కఱ లేదు" అని మ్రోగించుకుంటూ వెళ్ళిపోయింది.

"అయితే చేతిలోవున్న డిక్కీతప్ప తక్కినవన్నీ అమ్మేసిందఁటానా అది తెల్లారి అప్పుడే" అని అడిగింది లేడీ గొడారి కోడెగాణ్ణి. వాడు "మరిలేకుంటే ఆ జీలుగుబెండుకు అన్ని చిల్లులు ఎలావచ్చాయి?" అన్నాడు.

"యుద్ధం ముగిశాక, మళ్ళి వేళాకోళంగా కబుర్లు చెప్పుకున్నది ఈ వేళే! దాన్ని వెనక్కి పిలువు. అది ముస్లిమ్ స్త్రీ కాబోలు" అంది లేడీ.

"అయితేం పలుకుద్ది. మీతో యుద్ధపు రోజుల్లో నేనెంత నేస్తంకట్టానో, శాంతయుగంలో ఆమెతోనూ నేను అంత

నేస్తంకట్టాను" అన్నాడు గొడారన్న. "బలే జోళ్లు కుట్టే వాడవురా నువ్వు!" అంది లేడీ. అంటూ అర్ధణా వానికిచ్చింది తన పర్సులోంచితీసి. వాడు ఆ ముస్లిమ్ స్త్రీని వెనక్కు వచ్చే టట్టుచేసి, ఆ అర్ధణాపెట్టి ఆ డిక్కీ కొని దాన్ని ఆ లేడీకి బహూక రించాడు. లేడీ వెళ్ళిపోయింది.

"ఏం? నేరుగా నా దగ్గఱ కొనుక్కుంటే తప్పనుకుంది కాబోలు ఆమె. ఆమె కిరస్తానీ మనిషిలాగుందే?" అని అడిగింది బీబీ. గొడారన్న "కనిపెట్టేవు! అయితే నీకూ నాకూ ఈ మధ్య ఎంత నేస్తమో ఆ మధ్య నాకూ ఆమెకూ అంత నేస్తం" అన్నాడు.

"అయితే ఆ డిక్కీ చిరిగితే కుట్టేది నీవేనన్నమాట"— "ఆఁ నీ చేతిలో చిరిగితే ఎంత కుట్టిపెట్టానో ఆమె చేతిలో చిరిగినా అంతే!"—"అయితే డిక్కీ చిరిగితే కుట్టేదెవడు?" అని అడిగింది బీబీ మళ్ళీ. "మఱచిపోనావు. "దేవుడు" అని చెప్పలే ఇందాకా?" అన్నాడు.

బీబీ "నేను మఱచి పోతానా? నేను మఱచి పోయినా ఈ జీలీబెండు చిల్లులు మఱచిపోనేరవు. అన్ని అన్ని నోళ్ళయి ఈ పయినుండి మారుమోగేవనుకో! దేవుడు! దేవుడు! దేవుడు" అంటూ వెళ్ళిపోయింది.

ఆఖరు డిక్కీకూడా ఏలాగో, ఏలాగో యేం? బాగానే అమ్ముడు వోయింది అన్న ఆనందం అనుకోనా ఆ బీబీది అదంతా? లేకుంటే నిశ్శేషంగా చిల్లులుపడ్డ జీలుగుబెండుగుండా ఆమెగన్న "అల్లా" యందలి పూరా నమ్మకమనుకోనా?

.... .... .... .... ....